క్లుప్తంగా

రైలు ప్రయాణికులకు అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవికుమార్ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ టౌన్, పోర్టు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు శనివారం జీఆర్‌పీ ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బృందం అవగాహన కల్పించింది. రైలు ప్రయాణాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, రైలు బండిలో తరలించకూడనివి, దొంగతనాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అత్యవసర వేళల్లో తీసుకోవలసిన చర్యలను వివరించారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు, రాజమహేంద్రవరం రైల్వే డీఎస్పీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పోలీసులు

కాకినాడ రూరల్: యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రైనీ డీఎస్పీ కె.ప్రమోద్, సిబ్బంది శుక్రవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు తూరంగి వై.జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా కాజులూరు నుంచి మద్యం తరలిస్తున్న ఉండ్రు వీర్రాజు, కాకినాడ రూరల్ ఎస్.అచ్యుతాపురం గ్రామానికి చెందిన జి.ప్రియాస్ వరకుమార్‌లను పట్టుకుని కేసు నమోదు చేసి, మద్యం స్వాధీనం చేకున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



సారా తయారీ కేంద్రాన్ని గుర్తించిన వెంకటేశ్వరరావు బృందం

కాకినాడ క్రైం: నాటు సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. సంబంధిత వివరాలను కాకినాడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు శనివారం వెల్లడించారు. సామర్లకోట పట్టణంలో నాటు సారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రైల్వే స్టేషన్ సమీపంలో పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన గంజా గంగాధర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాన్ని వెంకటేశ్వరరావు బృందం గుర్తించింది. 1200 లీటర్ల ఊట ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కాకినాడ నార్త్ స్టేషన్ అధికారులకు అప్పగించి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కాకినాడ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు స్వీకరిస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ పీవీఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించవచ్చునని కోరారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, హాజరైన నాయకులు, పార్టీ శ్రేణులు

ఎన్నికలకు సిద్ధం

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు
- వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం
- కేడర్‌లో జోష్ నింపిన ప్రసంగం

కాకినాడ: రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భీమిలిలో పోరుకు 'సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావాన్ని పూరించిన నేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక డి కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం జరిగింది. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను క్లీన్ స్వీప్ చేసే దిశగా పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కేడర్‌ను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. రానున్న 70 రోజులు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష టీడీపీ–జనసేన కూటమి అనేక కుట్రలు, కుతంత్రాలతో ప్రజలను తప్పుదారి పట్టించే పనికి శ్రీకారం చుడుతోందని, ఇటువంటి దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా తిప్పికొట్టాలని ద్వారంపూడి పిలుపునిచ్చారు. మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమం చేశామని, వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పగలిగితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశించిన లక్ష్యం నూరు శాతం నెరవేరగలదన్నారు. ప్రతి కార్యకర్తకు జగన్ సీఎం కావాలన్నదే అంతిమ లక్ష్యంగా ఉండాలని, చిన్నచిన్న అభిప్రాయ బేధాలు, తెలుగుదేశం వంటి పార్టీలు చేసే కుట్రలను ఏ మాత్రం పట్టించుకోవద్దని సూచించారు. పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు రానున్న రోజుల్లో సముచిత గుర్తింపు ఉటుందని స్పష్టం చేస్తూ, పార్టీ కేడర్ పడే శ్రమకు విలువ కట్టలేమన్నారు. ఇకపై క్లస్టర్ కార్యాలయాల వద్ద అధిక సమయాన్ని వెచ్చించి రానున్న ఎన్నికల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు. నిత్యం తమతమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ద్వారంపూడి పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్ తదితరులు పార్టీ అభ్యున్నతి కోసం సూచనలిచ్చారు. రాష్ట్ర రైసు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలతో గ్రామాలు



పాతర్లగడ్డలో సీసీ రోడ్డు, కల్వర్టులను ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- పాతర్లగడ్డలో రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని దానికనుగుణంగా నిధులు మంజూరుచేసి, మౌలిక వసతులు కల్పించినట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం పాతర్లగడ్డ గ్రామంలో శనివారం ఆయన స్థానిక నాయకులతో కలసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించినప్పుడు ప్రజల వినతి మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి, పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. టీడీపీ నిర్లక్ష్యం చేసిన వంతెనకు మోక్షం కల్గించామని తెలిపి, అప్రోచ్‌రోడ్డుకు స్థలమిచ్చిన మద్దుల అప్పారావు ఇతరులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతికోసం అహర్నిశలు పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలిచి, తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించినట్టు తెలిపారు. ముందుగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కోసం రూ.77 లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంక్, పైపులైన్‌కు, రూ.50 లక్షలతో నిర్మించిన వంతెనకు, మరో రూ.23 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, అంబేడ్కర్ విగ్రహాలకు విశ్రాంతి భవనాలకు ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవాలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల ఎస్సీ నాయకులు మూరా అవినాష్, మద్దుల అప్పారావు, చిన్నం వెంకటేశ్వరరావు, మారెళ్ల వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం



ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులతో కమిషనర్ నాగనరసింహారావు



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

- కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు
- నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

కాకినాడ: క్రీడాకారుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం – ఆంధ్ర పేరుతో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ, మురికివాడల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ ప్రతిభ చాటే అవకాశం రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని క్రీడాకారుల సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, ఆయా క్రీడల కోచ్‌లు పాల్గొన్నారు.

మహిళలకు రూ.102 కోట్ల ఆసరా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వేడుకగా నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కాకినాడ: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా సిటీ నియోజకవర్గంలోని 3754 స్వయం సహాయక సంఘాలకు రూ.102 కోట్ల లబ్ధి చేకూర్చామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వివరించారు. స్థానిక సాంబమూర్తి నగర్, గొడారిగుంట, రెవెన్యూ కాలనీ ప్రాంతాల్లో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆసరా నిధులకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ మాఫీ చేస్తామంటూ గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో దగాపడ్డ డ్వాక్రా మహిళల కోసం ఈ పథకాన్ని సీఎం జగన్ అమల్లోకి తీసుకువచ్చారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఉన్న డ్వాక్రా రుణ మొత్తాన్ని నాలుగు విడతలుగా తీరుస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేసి చూపించారన్నారు. మొత్తం మీద ఇచ్చిన హామీలన్నీ నవరత్న పథకాల ద్వారా అమలు చేసిన ఒకే ఒక ముఖ్యమంత్రిగా సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు.

2025కి 30 వేల ఇళ్లు

కాకినాడలో దాదాపు 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిస్తే 2025 డిసెంబర్ నాటికల్లా ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రతి ఒక్కరి సొంత ఇంటి కలను సహకారం చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం, జనసేన వంటి పార్టీలు దొంగ హామీలతో ముందుకొస్తున్నాయని, దీనిని నమ్మొద్దని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలా నమ్మితే మరోసారి ప్రజలంతా మోసపోతారని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ నాలుగు విడతల్లో ఆసరా పథకం ద్వారా 37,716 మంది మహిళలు 102.19 కోట్లు లబ్ధి పొందారన్నారు. టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్ ఆసరా సంబరాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ ఆసరా పథకం లక్ష్యాన్ని చక్కగా వివరించిన ఓ మహిళలకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రూ.2000 నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ప్రియంవద, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

గానగంధర్వుడికి ఘన నివాళి



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల కోడలు పార్వతి



నృత్యం చేస్తున్న ఘంటసాల పార్వతి బృందం

బోట్‌క్లబ్: కాకినాడ బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయ సెంటర్‌లోని పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు విగ్రహాన్ని శనివారం ఆయన కోడలు ఘంటసాల పార్వతి సందర్శించారు. కాకినాడ సంగీత విద్వత్సభ నిర్వహిస్తున్న సంక్రాంతి సంగీత నృత్యోత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె ఘంటసాల కళాపీఠం, అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక ఏర్పాటు చేసిన ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పుష్పాంజలిని ఘటించి నివాళులు అర్పించారు. పీఠం అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, కార్యదర్శి పంపన దయానందబాబు, సంగీత విద్వత్ సభ అధ్యక్షుడు వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పార్వతి బృందం నృత్య ప్రదర్శన

సంగీత విద్వత్సభ సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఘంటసాల పార్వతి బృందం నృత్య ప్రదర్శన సంగీత ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. వీరు అన్నమాచార్యుల నృత్య రూపకం శ్రీమన్నారాయణ, గోవింద, భావయామి అలరులు, బ్రహ్మమొక్కటే మొదలైన సంకీర్తనలకు నృత్యం చేసి అందరినీ అలరించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు దినకరా, రాజశేఖరా, ననుపాలింప, శివశంకరి వంటి అద్భుత గీతాలను సాంప్రదాయ నృత్యప్రదర్శన చేసి ప్రేక్షకులను అబ్బురపరిచారు. పార్వతి శిష్యులు ప్రియ, హరిణి, పవిత్ర, స్వేత, కావ్య, గాయత్రి ఈ నృత్య కార్యక్రమంలో వారి అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను మైమరపించారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం



మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక 9వ డివిజన్ పరిధిలోని భగీరథ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు. పచ్చళ్లు, దుస్తులు, చేతి వృత్తులు, జంతికలు, స్వీట్లు వంటి ఆహార వస్తువులతో పాటు దాదాపు 25 రకాల వస్తువులను స్టాల్స్‌లో ప్రదర్శించారు. వీటిని ఎమ్మెల్యే ద్వారంపూడి తిలకించి మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఆయా ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసిన మెప్మా యంత్రాంగాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అలాగే రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకు విక్రయించే నమూనా ఆహార క్యాంటీన్లను కూడా ఎమ్మెల్యే సందర్శించారు. ఆన్‌లైన్ ద్వారా డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే 'జగనన్న ఈ మార్ట్' ప్రక్రియను కూడా ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మెప్మా పీడీ ప్రియంవద, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా 'ద్వారంపూడి' ట్రస్ట్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సోముప్రసాద్. చిత్రంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, వీరభద్రారెడ్డి, చంద్రకళాదీప్తి

- అధ్యక్షుడు వీరభద్రారెడ్డి హామీ
- పోర్టు కార్మికులకు కంటి వైద్య శిబిరం

కాకినాడ: ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు అండగా నిలుస్తామని ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురంలోని ట్రస్ట్ కార్యాలయంలో సుమారు 400 మంది పోర్టు కార్మికులకు ట్రస్ట్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, సోముప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సోముప్రసాద్, ఇతర ప్రముఖులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పిఠాపురంలోని క్రిస్టియన్ మెడికల్ సెంటర్ వైద్య నిపుణులు సుమారు 400 మందిని పరీక్షించి ద్వారంపూడి ట్రస్ట్ ద్వారా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. వీరభద్రారెడ్డి మాట్లాడుతూ సోముప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ స్ఫూర్తితో తమ ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సోముప్రసాద్ మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొనే గైనిక్ సమస్యలపై సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు సిద్ధమని ప్రతిపాదించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఆర్యవైశ్య మహాసభ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాదం మధు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపరచడానికి స్మార్ట్ జీనియర్స్ నిర్వహించే అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీలకు అంతర్జాతీయంగా 19 వేల మంది హాజరుకాగా, 1350 మంది ప్రతిభ చూపారు. వీరిలో 529 మంది అనగా 40 శాతం తమ విద్యార్థులు ఉన్నారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. విజేతలకు ఫిబ్రవరి 25న హైదరాబాద్ రవీంద్ర భారతిలో బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు శృతిరెడ్డి, ఎస్‌పీ రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మన్విత మధుమయికి కలెక్టర్ సత్కారం



మన్విత మధుమయిని సత్కరిస్తున్న కోనసీమ కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈదరపల్లి కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాన్విత మధుమయి తన వేణుగానంతో అలరించారు. వేణుగానంలో అత్యుత్తమ ప్రతిభను మెచ్చి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆమెను మెమోంటో, శాలువతో సత్కరించారు.

నాడు అలా.. నేడు ఇలా..



నాటి పరిస్థితి.. వర్సిటీ రహదారిపై నిలిచిపోయి నీరు



అదే ప్రాంతంలో నిర్మిస్తున్న రహదారి

- శరవేగంగా వర్సిటీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- నలుగురు వీసీలు మారినా పట్టించుకోని వైనం
- పద్నాలుగేళ్ల సమస్యకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న విదార్థులు, అధ్యాపకులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఏర్పడి 14 ఏళ్లు పూర్తయి మూడేళ్ల కాల పరిమితితో నలుగురు ఉప కులపతులు మారారు. వచ్చామా వెళ్లామా అని తప్ప వర్సిటీలో కనీస మౌలిక వసతులపై దృష్టిపెట్టలేదు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి కల్పనే కాకుండా ప్రధాన సమస్యలపై ఈ ప్రభుత్వంలో రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభ కావడంతో విద్యార్థులతో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో నిధులు ఉన్నా, వారికి ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ప్రతిపాదనలతో కాగితాలకే పరిమితం చేసేవారు. కళాశాల నుంచి వర్సిటీస్థాయికి ఎదిగిన క్యాంపస్‌లో వర్సిటీ ప్రారంభ దశలో వేసిన తారు రోడ్డే తప్ప ఇప్పటి వరకూ ఏ విధమైన పనులూ చేపట్టక పోవడంతో అవి అస్తవ్యస్తంగా మారాయి. దాదాపు 100 ఏకరాల విస్తీర్ణం కలిగిన క్యాంపస్‌లో ఒక పక్క కళాశాల, హాస్టళ్లతో పాటు మరో పక్క వర్సిటీ పరిపాలన భవనం ఉంది. విద్యార్థులు, సిబ్బందితో పాటు వర్సిటీకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారితో కలిపి ప్రతి రోజూ దాదాపు 3 వేల మంది సంచరిస్తూ ఉంటుంటారు. అటువంటి ప్రాంగణంలో రహదారి వ్యవస్థలేక నానా అవస్థలు పడేవారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తే సమస్య మరీ విపరీతంగా ఉంటుంది. వర్సిటీ చుట్టుపక్కల ఎత్తైన రోడ్లు వేయడంతో నీరు బయటకు పోయే మార్గం లేక నీరు వారం రోజుల పాటు నిల్వ ఉండిపోతుంది. ప్రస్తుతం దాదాపు రూ.20 కోట్లతో సిమెంట్ రోడ్లతో పాటు డ్రైనేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు.

ప్రతి నెలా సమీక్ష



పనులు ప్రారంభించిన నాటి నుంచి ప్రతి నెలా సమీక్ష నిర్వహించి త్వరగా పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చాం. ఈ ఏడాది పూర్తిచేసి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అలాగే స్నాతకోత్సవ భవనం, హాస్టల్స్ భవన నిర్మాణాల పనులు 50 శాతం పూర్తిచేశాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

విద్యార్థుల ఆశలే ఆశయాలు



శ్యామ్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: విద్యార్థుల ఆశలను ఆశయాలుగా మార్చడమే తన ధ్యేయమని శ్యామ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు గుంటూరి శ్యామ్ అన్నారు. శనివారం కాకినాడ రోటరీ క్లబ్ గోల్డెన్ జుబ్లీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్యామ్‌ను ఘనంగా సత్కరించారు. క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పలువురు రోటరీ క్లబ్ సభ్యులు ఈ సత్కారం చేశారు. క్లబ్ అధ్యక్షులు రవి కృష్ణ మాట్లాడుతూ తమ క్లబ్ ఉపాధ్యక్షుడైన శ్యామ్ ఇంతటి ఘనత సాధించడం గర్వంగా ఉందన్నారు. క్లబ్ సభ్యులు జోగా చంద్రరావు, మాచారెడ్డి, చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా కుల గణన



ఎమ్మెల్యే కురసాల నుంచి కుల వివరాలు సేకరిస్తున్న సచివాలయం-2ఏ సిబ్బంది

కాకినాడ రూరల్: గ్రామాలలో కుల గణన చురుగ్గా సాగుతోంది. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుల గణన వివరాలు సేకరిస్తున్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో కాకినాడ అర్బన్ సచివాలయం – 2ఏ సిబ్బంది శనివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాసంలో ఆయన వివరాలు సేకరించారు. రూరల్ నియోజకవర్గంలో అధికారులు పర్యవేక్షణలో ఈ కులగణన సర్వే చేపడుతున్నారు.